


# అమెరి'కలకలం' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



***11***

## మొట్టమొదటి జాతీయ యువ సాహితీ సదస్సు – కాదు సుమా కల కాదు సుమా!

నాకు సాధారణంగా రాత్రి పూట కలలు రావు. ఎందుకంటే అసలు రాత్రి నిద్రపట్టి చస్తే కదా! ఒక వేళ మగత నిద్ర పడుతూ, పడుతూ ఉండగా ఐశ్వర్యా రాయో, కాజల్ రప్పో నా కలలోకి ప్రవేశించే ప్రయత్నంలో ఉండగానే మా క్వీన్ విక్టోరియా ఆ మాత్రం దానికే నా పాతివ్రత్యం మంట గలిసింది అనుకుని ఠకీమని టెంకి జెల్ల తాయిలం ఇచ్చేసి, నన్ను మళ్ళీ నిద్రపోకుండా చేసి, సదరు రాయీ, రప్పలని బొంబాయి దాకా తరిమికొట్టేసి తను వర్క్ కి పారిపోతుంది. కానీ అప్పుడప్పుడు వారాంతంలో మధ్యాహ్నం కక్కుర్తిగా, ఆబగా భారీ లంచ్ తినేసి దున్నపోతులా నేను పడుకున్నప్పుడు పగటి కలలు కంటూ ఉంటాను. ఎందుకో తెలియదు కానీ నా పగటి కలలని సుందరీ మణులు బాయ్ కాట్ చేస్తారు. కానీ అప్పుడప్పుడు మంచి "బుర్రాలోచనలు ఆ నిద్ర లోనే తట్టి లేపుతాయి. సుమారు ఏడాది క్రితం జరిగింది అదే!

దానికి నాందీ ప్రస్తావన అక్కినేని గారు తానా వారి నిర్వహణలో తన 89 వ పుట్టిన రోజు పండగకి డాలస్ వచ్చినప్పుడు ఏదో మాటల సందర్భంలో ఆయన "ఇక ముసలాడిని అవుతున్నానుగా, ఎక్కువ ప్రయాణాలు చెయ్య లేను అన్నారు నాతో.

దానికి నేను ఆశ్చర్యం నటించి "అదేమిటి సార్, అమెరికాలో మగాడి వయసు గురించిన రూల్స్ మీకు తెలియదా అన్నాను.

"మగాడి వయసు గురించి కొత్త రూల్సా..అదేమిటి?" అని అడగగానే

"అదే నటసమ్రాట్ గారూ, అమెరికాలో మగాడి వయస్సు అతను చూసే ఆడపిల్ల వయస్సుతో సమానం. అదే మా నిత్య యవ్వనానికి పరమౌషధం అని చమత్కరించాను. దానికి ఆయన ఒక క్షణం నివ్వెర పోయి.

జోక్ అర్థం చేసుకుని "అయితే ఇంకేం, నేనూ అలాగే ఫాలో అయి ఇరవై నుంచి అరవై ఏళ్ల వాళ్ళని చూస్తూ యింకా కుర్రాణ్ణి అయిపోతాను" అని గల, గలా నవ్వారు.

దీని ప్రతిపదార్థం ఏమిటంటే, నా వయసుతో నాకు పెద్ద పేచీ ఏమీ లేదు కానీ మనం మానసికంగా అయినా యువతలా ఉండిపోవాలనుకుంటే, ఆ వయసు వారితో సరదాగా కలిసిపోవాలి. పెద్దరికం డంబాలు కొట్టుకోకూడదు.

అక్కినేని నాగేశ్వర రావు గారితో మాట్లాడిన వారం, పది రోజుల తరువాత ఒకానొక ఆదివారం పైన ఉదహరించినట్టుగా మా క్వీన్ విక్టోరియా మంచి మూడ్ లో ఉండి చేసిన ఐదారు మసాలా దోశలు లంచ్ లాగించేసి తె.దు.పో ...అనగా "తెల్ల దున్నపోతు" వలె

విశ్రమించినప్పుడు వచ్చిన పగటి కలలో అనేక మంది యువతీయువకులు కథలు, కవిత్వాలు రాసుకుంటూ, వాటిని ఎవరికీ వినిపిద్దామా అని నిస్పృహాయంగా చుట్టూ చూస్తూ కనపడ్డారు.




వాళ్ళందరి మధ్యా నేను కూడా తిరుగుతూ కుర్రాణ్ణి అయిపోవడమే ఆ పగటి కల సారాంశం. అప్పుడు వచ్చిన చిన్న ఆలోచనే ఇప్పుడు నిజంగానే అద్వితీయంగా, విజయవంతంగా జరిగిన "మొట్టమొదటి జాతీయ యువ సాహితీ సదస్సు. రాష్ట్ర విభజన ప్రకటన వలన వలన ఆంధ్ర ప్రదేశ్ అంతటా అట్టుడికిపోతున్న వాతావరణాన్ని సైతం లక్ష్యపెట్టకుండా సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ 5, 2013 దాకా హైదరాబాద్ లో (శ్రీ త్యాగరాజ గాన సభ, సాయంత్రం 5 నుంచి) జరిగిన ఈ యువతరం సాహిత్య సమ్మేళనానికి ఆంధ్ర ప్రదేశ్ లో ఉన్న 23 జిల్లాల నుంచీ, నాలుగు ఇతర రాష్ట్రాల నుంచీ మొత్తం 150 మంది యువ సాహితీ వేత్తలు, రచయితలూ వక్తలుగా పాల్గొన్నారు. 15-35 వయోపరిమితిలోని వారే వక్తలుగా ఉండాలనేది మా ప్రధాన నిబంధన. చెడ్డీ వేసుకుని యువకుడిగా చెలామణీ అవుదామనుకున్న నన్ను కూడా వేదిక ఎక్కనివ్వలేదు మా నిర్వాహక బృందం. కేవలం ప్రారంభ సభ, ముగింపు సభ, ప్రతీ రోజూ ముందు దీప ప్రజ్వలన సమయంలో సభకి వచ్చిన వారిలో కొందరు పెద్దలని, కొందరు ఆహ్వానితులనీ యువతకి "స్ఫూర్తి ప్రదాతలు"గా వేదిక పైకి కొన్ని నిముషాలు ఆహ్వానించడం జరిగింది. డా. సినారె, డా. ఎండ్లూరి శివారెడ్డి గారు (తెలుగు విశ్వవిద్యాలయం), డా. కవితా ప్రసాద్ గారు (ఆంధ్ర ప్రదేశ్ సాంస్కృతిక శాఖ సంచాలకులు) కవి జొన్నవిత్తుల, పప్పు వేణుగోపాల రావు, డి. కామేశ్వరి, పొత్తూరి విజయ లక్ష్మి,




బలభద్రపాత్రుని రమణి, వాసా ప్రభావతి, ఆచార్య కె. యాదగిరి తెలుగు ఎకాడెమీ), మండలి బుద్ధ ప్రసాద్, కె.వి. రామణాచారి, ఆచార్య కొలకలూరి ఇనాక్, కూచిభొట్ల ఆనంద్, ముక్తేవి భారతి, సుద్దాల అశోక్ తేజ, అక్కిరాజు సుందర రామకృష్ణ, మంగళగిరి ప్రమీలా దేవి, దైవజ్ఞ శర్మ మొదలైన వారు "స్ఫూర్తి ప్రదాతలు గా పాల్గొన్నారు. ఈ ఏడు రోజుల సభలనీ సింగిశెట్టి లక్ష్మీ నారాయణ అనే విద్యార్థి సమయ స్ఫూర్తితో, చమత్కారాలతో 'హుషారుగా నిర్వహించారు. ఈ యువసాహితీ సమ్మేళనం విజయవంతం కావడానికి తెరవెనుక కష్టపడిన వారు తెన్నేటి సుధా దేవి, వంశీ రామరాజు, ద్వానా శాస్త్రి మొదలైన వారు కాగా, తక్కువ పని చేసి ఎక్కువ పొగడ్తలు పొంది పేరు కొట్టేసిన ఘనత నాది. ఈ అద్వితీయ యువ సాహిత్య సమ్మేళనం దృశ్య మాలిక ఈ క్రింది లంకె లో చూడవచ్చును.

https://plus.google.com/photos/118322101400606000726/albums/5931747238802089009?banner=pwa

ఈ సమ్మేళన విజయానికి స్పందించి, ఈటీవీ వారు ప్రసారం చేసిన 30 నిముషాల ప్రత్యేక కథనం ఈ క్రింది లంకెలో చూడవచ్చును.

http://www.youtube.com/watch?v=aNZOLwgwkSY

ఇక సీరియస్ గా సాగిన ఈ యువ సాహితీ సమ్మేళనంలో కూడా నాలో ఉన్న "యువ హాస్య గాడి"కి కొన్ని సరదా సన్నివేశాలు కనపడుతూనే ఉన్నాయి. ఉదాహరణకి ఒక అమ్మాయి పోడియం వదిలేసి వేదిక మధ్యలో మైకు పట్టుకుని నుంచుని పెద్ద గొంతుకతో "మాతృదేవో బావా, పితృదేవో బావా అని "ఏడతానున్నాడో బావా అనే భానుమతి టైపులో పలవరిస్తూ ఉండగా ప్రేక్షకుల మధ్యలోంచి

ఒక యువకుడు ఠపీమని లేచి వేదిక దగ్గరకి వచ్చాడు. అది చూడగానే ఆ అమ్మాయి "ఆచార్య దేవో బావకీ, అతిధి దేవో బావ" కీ గుడ్ బై చెప్పేసి తన ప్రసంగం కాగితాలు పక్కకి విసిరేసి ఆ కుర్రాడితో బైక్ మీద ఈ సువిశాల ప్రపంచంలోకి మాయమై పోయింది. ఆ యువకుడే ఆ రచయత్రి తాలూకు బావ అని నాకు తరువాత తెలిసింది. మరొక యువ రచయిత "సాహిత్యంలో రైతు కష్టాలు" అనే అంశం మీద ప్రసంగం మొదలు పెట్టి, అందులో సాహిత్యం మాట మర్చిపోయి పదిహేను నిముషాలు రైతుల దుస్థితి మీద, వారి ఆత్మహత్యల మీద చంద్రబాబు బాబులా రాజకీయ ప్రసంగం చేసాడు. అన్నింటికన్నా పరాకాష్ట ఒక కుర్రాడిదే. ఆ యువకుడు కూడా వేదిక మధ్యకి వచ్చి సాహిత్య ప్రసంగం మాట దేవుడెరుగు పూనకం వచ్చిన వీర శివ భక్తుడి లాగా చేతులు ఆకాశం లోకి ఎత్తేసి,..శివోహం అంటూ పది నిముషాలు అరిచి, చెమటలు పట్టించుకుని అప్పుడు నన్నయ కంటే మా వరంగల్ పోతన గొప్పవాడు అంటూ ఆవేశం తో ఊగడం మొదలుపెట్టాడు. నాకు భయం వేసి, ఎందుకైనా మంచిది అని ఆ కుర్రాణ్ణి బతిమాలి వేదిక మీద నుంచి దింపెయ్య వలసి వచ్చింది. అ కుర్ర వాడు కించిత్తు బాధ పడి, ఆఖరి రోజున సభ పూర్తి అయిపోయాక అందరూ ఇంటికి వెళ్ళిపోతూ ఉంటే నన్నూ, ఇతర "ఆంధ్రోల్ల"నీ మాకు అర్థం అవని భాషలో తిట్టి తన అక్కసు తీర్చుకున్నాడు. అప్పుడు పత్రికల వారు ఎవరూ లేరు కాబట్టి సరిపోయింది. ఇవన్నీ నిజానికి జరిగే, జరగని సంఘటనలే!


యువత ద్వారానే సమాజ మార్పు


తెలుగు యువతకు 'వంగూరి' ఆహ్వానం


సాహితీ వనం.. యువకళ 'కలం'

అన్నట్టు పత్రికలంటే `జ్ఞాపకం వచ్చింది ఇంచు మించు అన్ని పత్రికల వారూ యువతకి ప్రాధాన్యత ఇస్తూ ఈ సభా విశేషాలని ప్రతీ రోజూ ప్రచురించారు. ఉదాహరణకి పత్రికల లో వచ్చిన రెండు వార్తా కథనాలను ఇందుతో జతపరుస్తున్నాను. మన పత్రికల వారితో ఉన్న సౌలభ్యం ఏమిటంటే, మనం ఏం చెప్పినా వాళ్లకి కావలసినది వాళ్ళు రాసుకుంటారు.

ఈ యువ తరం సాహితీ సమ్మేళనం లో నాకు ప్రధానంగా నచ్చిన విషయాలు క్రమ శిక్షణ, సమయ పాలన, మాట్లాడిన అంశాలపై అవగాహన, పాండిత్యం, ప్రేక్షకుల విజ్ఞతకి విలువ ఇవ్వడం, అప్పటికప్పుడు నోటికొచ్చినది మాట్లాడకుండా ముందుగానే ప్రసంగం తయారు చేసుకుని రావడం, ఇతర వక్తలకి తగిన గౌరవం చూపడం మొదలైన అనేక అంశాలలో, ***ముఖ్యంగా సభా మర్యాద విషయంలో చాలా మంది స్వయంప్రకటిత సాహితీ పెత్తందార్లకంటే ఈ నాటి యువత ప్రవర్తన ఉన్నతమైన స్థాయిలో ఉంది.***

ఈ సమ్మేళనానికి పరాకాష్టగా సదస్సు ముగిసిన పదిహేను రోజులలో సుమారు 150 మంది యువత చదివిన కవితలు, కథలూ, చర్చావేదిక విశేషాలు యథాతథంగా "మొట్టమొదటి జాతీయ యువ సాహితీ సమ్మేళనం - సభా విశేష సంచికను ప్రచురించి అక్టోబర్ 21, 2013 నాడు విడుదల చెయ్యగలగడం మేము నిజంగానే గర్వించదగ్గ విషయం. ఆ రోజునే దేవులపల్లి వారి మనుమరాలు శ్రీమతి లలితా రామ్ (బుజ్జాయి గారి కుమార్తె, పోర్ట్ లాండ్, అమెరికా ) తొలి రచన "అవంతీ కల్యాణం అనే సాంఘిక నవలను కూడా ఆవిష్కరించడం జరిగింది. ఆ ఆవిష్కరణ సభ ఫోటో కూడా ఇందుతో జతపరుస్తున్నాం.



మొత్తానికి ఈ మొట్టమొదటి జాతీయ యువ సాహితీ సమ్మేళనం వ్యక్తిగతంగానూ, సంస్థాపరంగాగానూ నాకు అపరిమితమైన ఆనందాన్ని, సంతృప్తినీ ఇచ్చింది. అంతకంటే ముఖ్యంగా తెలుగు భాషా సాహిత్యాల ఉజ్జ్వల భవిష్యత్తుకి ఈ నాటి యువతరం మంచి పునాదులు నిర్మించుకుంటున్నారు. "అంతకు మించిన ఆనందం ఇంకేముందీ. ఇక నువ్వు రిటరై పోవచ్చు" అంటుంది మా క్వీన్ విక్టోరియా!

మా బ్లాగ్: www.vangurifoundation.blogspot.com

COMMENTS